క్లుప్తంగా

32 మందికి కంటి శస్త్ర చికిత్సలు


శస్త్ర చికిత్స చేయించుకున్న బాధితులు

నారాయణఖేడ్: సత్యసాయి సేవానిలయంలో ఈనెల 16న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 53 మందికి చికిత్సలు అందించగా వారిలో 36 మందికి కంటి పొరల శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. 32 మందికి ఉచిత రవాణా సదుపాయాలు కల్పించి హైదరాబాద్, నానక్ రాంగూడలోని శంకర కంటి ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అనంతరం వారికి తగ్గిన సూచనలు, సలహాలు ఇచ్చి వారి సొంత గ్రామాలకు పంపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


నిర్మాణాలను తొలగిస్తున్న జేసీబీ

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని అలీనగర్ సర్వే నంబర్ 27లో ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులకు తహసీల్దార్ దేవదాస్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ మున్సిపల్ అధికారుల సహకారంతో కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే సహించబోమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనుమతులు తప్పనిసరి

జిన్నారం(పటాన్‌చెరు): నూతనంగా నిర్మించే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం 'బిల్డ్ నౌ' అనే వెబ్‌సైట్ ద్వారా అనుమతులు పొందవచ్చని తెలిపారు. లేదా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని రాంతీర్థ్ గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు కంగ్టి అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్ డాక్టర్ ముస్తాక్‌అలీ తెలిపారు. పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన టీకాలు పశువులకు ఉచితంగా వేస్తున్నట్లు చెప్పారు. రాంతీర్థ్‌లో 250 పశువులకు టీకాలు వేశారు. రైతులకు గాలికుంటు వ్యాధి తీవ్రతపై అవగాహన కల్పించారు.

పరిశుభ్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

నారాయణఖేడ్: చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పట్టణవాసులు సహకరించాలని మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ కోరారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని 10వ వార్డు కాలనీవాసులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. మహిళలకు తడి, పొడి చెత్త, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను మున్సిపాలిటీ వాహనంలో వేసి సహకరించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జహీరాబాద్ టౌన్: ఇటీవల మృతి చెందిన గవర్నమెంట్ టీచర్ సుజాత కుటుంబానికి పీఆర్టీయూ నాయకులు శనివారం లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణంలోని ప్రభుత్వ నం.4 పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ సుజాత మృతి చెందిన విషయం తెలిసిందే. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభులు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాణయ్య మాట్లాడుతూ.. మరణించిన టీచర్ల కుటుంబాలకు పీఆర్టీయూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవఅధ్యక్షుడు తులసీరాం రాథోడ్, ఎంఈఓ మాణయ్య, నాయకులు శ్రీశైలం, తుకరాం, సురేందర్, వరాలు, స్వామిదాస్, బాగయ్యపాల్గొన్నారు.


సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద..


వట్‌పల్లి(అందోల్): తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


నారాయణఖేడ్ కళాశాలల బంద్ చేయిస్తున్న నాయకులు


న్యాల్‌కల్ : ఆందోళన చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

బంద్ ప్రశాంతం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బీసీ బంద్ విజయవంతం అయింది. ప్రజాసంఘాల నాయకులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొని బంద్‌కు మద్దతు తెలిపారు. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూసేశారు. విద్యా సంస్థలు ఒకరోజు ముందుగానే సెలవు ప్రకటించాయి. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు అయ్యేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.


సదాశివపేట: అంబేడ్కర్ కూడలిలో రోడ్డుపై..


సంగారెడ్డి : డిపోలో యోగాసనాలు వేస్తున్న ఆర్టీసీ సిబ్బంది


హత్నూర మండలం దౌల్తాబాద్ చౌరస్తాలో..


రాయికోడ్ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..


మునిపల్లి(అందోల్): బుదేరా చౌరస్తాలో..


పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ చౌరస్తాలో..

ఐడీ ప్రూఫ్ తీసుకోండి

జహీరాబాద్ టౌన్: ఎవరైన స్క్రాప్ అమ్మడానికి వచ్చినప్పుడు వారి ఐడీ ప్రూఫ్ తప్పకుండా తీసుకోవాలని జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, ఎస్ఐ వినయ్‌కుమార్ వ్యాపారులకు సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం స్క్రాప్‌షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు స్క్రాప్ అమ్మడానికి వచ్చినప్పుడు వారి వివరాలు తెలుసుకోవాలన్నారు. దొంగలించిన వస్తువులను అమ్మే అవకాశం ఉందని, వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. బైక్, ఆటో ఇతర విలువైన వస్తువులను దొంగిలించి అమ్మడానికి వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. స్క్రాప్ దుకాణాల్లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

రెండవ విడత పుస్తకాల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో శనివారం రెండవ విడత ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి విడత వచ్చిన పార్టు-1 పుస్తకాలను జూన్ మాసంలో పంపిణీ చేశారు. శుక్రవారం వచ్చిన 15వేలు పార్టు-2 పాఠ్య పుస్తకాలను శనివారం ఉదయం ఎంఈఓ మారుతి రాథోడ్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రవి, సీఆర్‌పీలు రాజు, మాణిక్, గోపాల్ ఉపాధ్యాయులకు అందజేశారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ, సీఆర్‌పీలు

మహాసభలను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాలులో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే సీఐటీయూ జిల్లా నాల్గొవ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్‌గార్డెన్‌లో మహాసభల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణంలో మొదటిసారిగా నిర్వహిస్తున్న కార్మిక సంఘం నాల్గొవ మహాసభలకు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి సీఐటీయూ ముఖ్య నాయకులు కార్యకర్తలు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, శ్రీకాంత్, శ్రీనివాస్, మల్లేశ్, నర్సింలు, శ్రీను, అనందం, గణేష్, ప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ నేత ప్రవీణ్‌కుమార్

సోషల్ మీడియాపై జాగ్రత్త అవసరం

సీఐ వినాయక్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విశ్వభారతి లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని అధ్యక్షతన నిర్వహించిన లీగల్ అవేర్నెస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థులు సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ వివరాలు ఇతరులతో పంచుకోవద్దన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో స్నేహం చేయొద్దని సూచించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని మాట్లాడుతూ.. రైట్ టు ఎడ్యుకేషన్, బాల్యవివాహాలు, పోక్సోపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రణాళికాబద్ధంగా చదువుకొని లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ స్పందన చౌదరి,విశ్వ భారతి లా కళాశాల అధ్యాపకులు రమ్య, కీర్తి ,తేజశ్రీ, తేజ సప్తోజి, గురుమూర్తి, యాష్ వర్ధన్,కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వినాయక్ రెడ్డి

గుంతలమయంగా కంది చౌరస్తా


కంది చౌరస్తాలో బెంగళూరు బైపాస్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కంది(సంగారెడ్డి): ఓవైపు జాతీయ రహదారి, మరోవైపు బెంగళూరు బైపాస్ రోడ్డుతో కూడిన కంది ప్రధాన చౌరస్తాపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కంది గ్రామం చౌరస్తాకు ఇరువైపులా ఉండటంతో వాహనదారుల రాకపోకలతో బిజీగా ఉంటుంది. కంది చౌరస్తా రోడ్డు పాడవుతూనే ఉంటుంది. ఎప్పుడూ కంకర తేలి, దుమ్ము వస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ చౌరస్తాకు ఇరువైపులా ఉన్న ప్రధాన రహదారుల్లో రెండు అడుగుల మేర పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ చౌరస్తా దాటేందుకు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాలు ఈ గుంతల్లో దిగబడుతుండటంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు ఆగిపోతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఈ చౌరస్తాలో తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నా.. మళ్లీ కొద్దీ రోజులకే గుంతలు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


జాతీయ రహదారి వైపు ఏర్పడిన గుంతలు

లీకేజీ వల్ల రోడ్డు పాడవుతుంది


కంది చౌరస్తాలో మిషన్ భగీరథ నీటి లీకేజీతో రెండు ప్రధాన రహదారులు తరచూ పాడవుతున్నాయి. నేషనల్ హైవే అధికారులతో కలిసి పలుమార్లు మరమ్మతులు చేపట్టాం. అయినా నీటి లీకేజీ ఆపకపోవడం వల్ల తరచూ రెండు వైపులా రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణ చేపడుతున్నందునా త్వరలో ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది

– డీఈ రామకృష్ణ, ఆర్అండ్‌బీ

నేడు విద్యుత్ సరఫరా బంద్

పటాన్‌చెరు టౌన్: కిష్టారెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుల్తాన్‌పూర్ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థుల శ్రమదానం


కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులు శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తా, చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్ నగరంలోని రాజేందర్ నగర్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి డీసీఎంలో తరలిస్తున్న 12 టన్నుల రేషన్ బియ్యాన్ని శనివారం తెల్లవారు జామున రింగ్ రోడ్డుపై కొల్లూరు పోలీసులు పట్టుకొని వాహనాన్ని సీజ్ చేశారు. మహమ్మద్ షమీ డీసీఎంలో 12 టన్నుల రేషన్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో టాస్క్‌ఫోర్స్ టీం పర్యటన

సంగారెడ్డి: రెండు రోజులుగా స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం సంగారెడ్డి జిల్లాలో వివిధ ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసింది. ఇందులో భాగంగా వెల్నెస్ హాస్పిటల్, ఎస్వీ హాస్పిటల్, సన్‌రైజ్ హాస్పిటల్, కీర్తి హాస్పిటల్, లలిత ఫెర్టిలిటీ అండ్ లాప్రోస్కోపీ సెంటర్‌ను తనిఖీ చేశారు. హాస్పిటల్‌కి సంబంధించిన పర్మిషన్స్, చార్జెస్ లిస్ట్, స్టాఫ్ క్వాలిఫికేషన్ వివిధ రికార్డులను పరిశీలించారు. కీర్తి హాస్పిటల్, లలిత ఫెర్టిలిటీ అండ్ లాప్రోస్కోపీ సెంటర్‌ను పరిశీలించి స్కానింగ్ సెంటర్‌కు సంబంధించిన రికార్డులు డీఎంహెచ్ఓ ఆఫీస్‌కు ఇవ్వకుండా ఆన్‌లైన్ సబ్మిట్ చేయనందుకు స్కానింగ్ సెంటర్లను సీజ్ చేశారు. జిల్లా కమిటీ నిర్ణయం మేరకు వారికి ఫైన్ వేసి తగు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రైవేట్ హాస్పిటల్ నిర్వాహకులు నియమ నిబంధనలను తప్పక పాటించి రికార్డులు సక్రమంగా పొందుపరచాలన్నారు. లేని పక్షంలో తగు చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్‌టీం హెచ్చరించినట్లు జిల్లా వైద్యాధికారి నాగనిర్మల తెలిపారు.


ప్రైవేట్ ఆస్పత్రుల్లో వివరాలు సేకరిస్తున్న బృందం

కేతకీ ఆలయానికి విరాళం

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయానికి ఎకరా ఒక గుంట భూమిని విరాళంగా ఇచ్చారు. కర్ణాటక రాష్ట్రంలోని హుమ్నాబాద్ నియోజకవర్గంలోని చిద్రి గ్రామానికి చెందిన దత్తుకుమార్‌కు ఆలయం ఎదుట భూమి ఉంది. శనివారం ఆ రాష్ట్ర మాజీ మంత్రి రాజశేఖర్‌పాటిల్ ఆధ్వర్యంలో భూమికి సంబంధించిన పత్రాలను ఆలయాధికారులు, నాయకులకు అందజేశారు. త్వరలో ఆలయం పేరిట రిజిస్ట్రేషన్ చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, పాలక మండలి చైర్మన్, చంద్రశేఖర్ పాటిల్, ఆలయాధికారి శివరుద్రప్ప, సభ్యుడు మల్లయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.


భూమి పత్రాలను అందిస్తున్న దాతలు

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీఎం రేవంత్ రెడ్డిని శనివారం ఆయన నివాసంలో ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి ఆయన సతీమణి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి కలిశారు. ఈనెల 24న జరిగే తమ కుమారుడు అనీష్ రెడ్డి వివాహానికి రావాలని ఆహ్వాన పత్రికను అందించారు.



పెళ్లి పత్రికను అందజేస్తున్న అంజిరెడ్డి దంపతులు

చిత్రరూపకంగా పంటల సాగు

జహీరాబాద్: మండలంలోని బాబానగర్ గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినిలు తమ మూడు నెలల గ్రామీణ ఉద్యావన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా సాగు భూములు, భవనాలను గుర్తించారు. శనివారం గ్రామంలో చిత్ర రూపకంగా ముగ్గులతో భవనాలు, ప్రార్థనా మందిరాలు, నేల రకాలు, పంటల సాగును గుర్తిస్తూ అవగాహన పొందారు. వారి చిత్రరూపకాన్ని గ్రామ ప్రజలు చూసి అభినందించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్, విద్యార్థినులు జస్లిన్, నిషిత, భార్గవి, మాయావతి, అన్విత, లహతి, మీనాక్షి, హర్షిత, ఆధ్య, కావ్య, రైతులు రవి, సంజీవరెడ్డి, రాములు, సలీం, రామ్‌రెడ్డి, వెంకటాచలం, దత్తాత్రి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఉపాధ్యాయులు నర్సింహులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి సందడి

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ పాఠశాల వసతి గృహంలో ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల పూలతో అలంకరించి, టపాసులు పేల్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రిసిల్లా, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.


దీపావళి సంబరాల్లో విద్యార్థులు

నిజాంపూర్(కే) ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో..

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలకు వచ్చారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పర్యావరణానికి హాని కలిగించని మట్టితో విద్యార్థులు ప్రమిదలు తయారు చేశారు. పాఠశాలలో రంగుల ముగ్గులు వేసి పూలతో చక్కగా అలంకరించి, దీపాలను వెలిగించి సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయులు నవనీత సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పట్టణంలో..

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లోని పలు విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో లక్ష్మి పూజలు చేసి, దీపాలు వెలిగించి టపాసులు కాల్చారు. కొంతమంది విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు వచ్చి సందడి చేశారు.